సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9652278546

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వరదరాజస్వామిగా అప్పన్న



సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజు గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను మరో పల్లకీలో వేంజేపచేశారు. సింహగిరి మాడ వీధిలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

21న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

పెందుర్తి: స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి నిమిత్తం ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత సాధించి, 18–35 ఏళ్ల వయసుగల అభ్యర్థులు హాజరు కావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 77025 06614 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

శివాలయం నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న గొంప ముత్యాలనాయుడు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి వినాయక కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకుడు గొంప ముత్యాలనాయుడు రూ.5,01,116 విరాళంగా అందించారు. నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఈ విరాళం మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు గురువారం ఇచ్చారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో వినాయక గుడి నిర్మాణానికి ఈ మొత్తాన్ని దాత అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కమిటీ సభ్యులు దంగేటి నాని, దంగేటి ప్రసాద్, గెద్దం కృష్ణ, బర్ల రమణ, కొల్లి కృష్ణ, అడ్వకేట్ బేతిన శ్రీనివాస్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఠాకూర్‌రామ్‌సింగ్

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామిని ఏపీ ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ ఠాకూర్‌రామ్‌సింగ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ అందించారు.

కోడి పందాలాడుతున్న 13 మంది అరెస్ట్

- అక్రమ మద్యం తరలిస్తూ మరో ఇద్దరు

సబ్బవరం: మండలంలోని గంగవరం, మొగలిపురం, జలిజపాలెం, గాలిభీమవరం గ్రామాల్లో కనుమ పండగను పురస్కరించుకుని బుధవారం కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పందాలు ఆడుతున్న 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు సబ్బవరం సీఐ పిన్నింటి రమణ గురువారం వెల్లడించారు. వారి నుంచి 12 కోడి పుంజుల్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వ్యక్తుల్ని గురువారం కోర్టుకు తరలించామన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండల కేంద్రం సబ్బవరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. జూద క్రీడలపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు.

ఉద్యానసాగు.. లాభాలు బాగు

సంప్రదాయ వరి, చెరకు తదితర పంటల కంటే ఉద్యాన పంటల వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అందులోనూ కూరగాయలు, ఆకుకూరల సాగుతో అధిక లాభాలనార్జిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఉద్యానపంటల సాగుపై అధిక రాయితీలందించి, ప్రోత్సహించారు. ఆ ఫలితాలు పెందుర్తి నియోజకవర్గంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఇప్పటి నుంచి వచ్చే వేసవి వరకు చేతికొచ్చే ఆకుకూరలు, కాయగూరల సాగులో రైతులు బిజీగా ఉన్నారు.

- రబీలో పెరగనున్న ఉద్యాన పంటల దిగుబడి
- అధికాదాయం వచ్చే కూరగాయల పంటలపై దృష్టి
- ఆకుకూరల సాగు.. తక్కువ పెట్టుబడి, లాభదాయకం
- సస్యరక్షణ చర్యలపై అధికారుల సూచనలు



అమృతపురంలో క్యాబేజీ పంట

పెందుర్తి: ఉద్యాన పంటలకు పెట్టింది పేరు పెందుర్తి నియోజకవర్గం. పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లోని పల్లెల్లో కూరగాయల పంటలకు కొదవుండదు. ప్రధానంగా పెందుర్తి ప్రాంతంలో ఆకుకూరలు పండిస్తే, సబ్బవరం మండలం కాయగూరల సాగుకు ప్రసిద్ధి. ఈ ప్రాంతం నుంచే నగరానికి అధిక సంఖ్యలో కూరగాయలు, ఆకుకూరలు సరఫరా అవుతుంటాయి. ఇప్పటి నుంచి రానున్న వేసవి వరకు ప్రజలకు కూరగాయాలు అందించేందుకు నియోజకవర్గ రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం పెందుర్తి మండలంలోని 106 ఎకరాల్లో ఆకుకూరల పంట సాగవుతుంది. సబ్బవరం మండలంలో దాదాపు 500–600 ఎకరాల్లో కాయగూరల పంటలు వేశారు.

అన్ని పంటలూ సాగు చేస్తున్నారు

నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో సారవంతమైన ఎర్రనేలలు ఉన్నాయి. ఇవి అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలకు అనుకూలం. దీంతో బీర, బెండ, దొండ, గోరు చిక్కుడు, వంగ, బీన్స్, బరబాటి, క్యాబేజీ, క్యాప్సికం, టమాటా, మిర్చి, ఆనప, క్యారెట్, ముల్లంగి తదితర కూరగాయల పంటలతో పాటు తోటకూర, గోంగూర, బచ్చలి కూర, చుక్కకూర, పాలకూరలు వేసుకోవచ్చు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా క్యాబేజీ, దొండ, వంగ పంటల సాగు ఎక్కువగా జరుగుతోంది.



సబ్బవరంలో పూతదశలో వంగతోట



పెందుర్తి మండలం చింతలగ్రహారంలో కొత్తి మీర పంట



బెండసాగుపై రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన శాఖ అధికారి

సస్యరక్షణ చర్యలే కీలకం

- సాధారణంగా కూరగాయల పంటల కోసం నారుమడి నుంచే నేలను సారవంతం చేయాలి. పంట వేయడానికి కొద్ది రోజుల ముందు సేంద్రియ ఎరువులు మట్టిలో కలిపితే సారం పెరుగుతుంది.
- ఉద్యాన పంటలకు నారుదశ చాలా కీలకం. నారు ఆరోగ్యకరంగా ఉంటేనే పంట ఎదుగుదల, దిగుబడి బావుంటుంది. అందుకోసం నారు దశలో బయోటాక్సిన్ మందులు వాడాలి.
- నారు, మొక్కల దశలో తెగుళ్లు సోకకుండా బయోఫంగిసైడ్ ఒక కిలో, వేపపిండి 10 కిలోలు, 90 కిలోల పశువుల పేడ కలిపి పొలంలో చల్లాలి.
- సాధారణంగా కూరగాయలు/ఆకుకూరల పంటకు కుళ్లతెగులు, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగుళ్లతో పాటు, రసం పీల్చే పురుగుల నుంచి బెడద ఉంటుంది. దీన్ని నివారించేందుకు బైటాక్సిన్ మందు చల్లాలి.
- కూరగాయలు, ప్రధానంగా ఆకుకూరలు ప్రజలు నేరుగా తినేవి కాబట్టి ఎక్కువ మోతాదులో రసాయనాలు వాడకం మంచిది కాదు. సేంద్రియ ఎరువులు ముఖ్యంగా వేపపిండి, వేపనూనెల మిశ్రమాలను వాడడం వలన తెగుళ్ల సత్వర నివారణతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది.

మూడు వారాల్లో పంట తీయొచ్చు



మూడు దశాబ్దాలుగా కొత్తిమీరతో పాటు ఇతర ఆకుకూరలు సాగుచేస్తున్నాం. ఆకుకూరలు తక్కువ వ్యయంతో, తక్కువ సమయంలో చేతికి వస్తాయి. ఆదాయం కూడా మెరుగ్గా ఉంటుంది. కొత్తిమీర వేసిన మూడు వారాల్లోపే పంట తీయొచ్చు. మా ప్రాంతంలో పండించిన ఆకుకూరలను నగరంలోని రైతుబజార్లతో పాటు సంతలకు కూడా తరలిస్తాం. అకాల వర్షాలున్నప్పుడు మాత్రం కాస్త అప్రమత్తంగా ఉండాలి.

– బొడ్డేడ జగదీష్, రైతు, చింతలగ్రహారం, పెందుర్తి

క్యాబేజీకి మంచి డిమాండ్



కాయగూరల సాగే జీవనాధారం. మాకున్న భూమిలో అధిక శాతం కూరగాయలే పండిస్తాం. పంట వేసినప్పటి నుంచీ.. దాని సంరక్షణకు చాలా కష్టపడతాం. రసాయనాలు వాడకుండా సేంద్రియ పద్ధతిలోనే సాగు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతానికి క్యాబేజీతో పాటు బెండ, వంగ, దేముడు చిక్కుడు పంటకు డిమాండ్ ఉందని అవే వేశాం. త్వరలోనే పంట తీసి రైతుబజార్లకు, మార్కెట్‌కు తరలిస్తాం.

– బండారు సత్తిబాబు, రైతు, అమృతపురం, సబ్బవరం

రైతులకు అందుబాటులో..



పెందుర్తి ప్రాంతంలో ఆకుకూరల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సబ్బవరంలో కాయగూరల సాగు బాగుంది. పంట వేసిన తరువాత రైతులు ఎల్లవేళలా పంటను పరిశీలించాలి. పంటకు తెగుళ్లు సోకితే తీవ్రమైన నష్టం వస్తుంది. సస్యరక్షణ చర్యలతో దిగుబడి బాగుంటుంది. మా శాఖ తరఫున నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటున్నాం. విత్తనాలపై సబ్సిడీ కూడా ఉంది.

– జి.సోని, ఉద్యానశాఖ అధికారి, పెందుర్తి

మరమ్మతులు మరిచారు.. ప్రహారీలు నిర్మిస్తున్నారు




ఊటగెడ్డపాలెంలో ప్రాథమిక పాఠశాలకు నిర్మిస్తున్న రక్షణ గోడ

- శిథిలావస్థలో ఊటగెడ్డపాలెం, జాలరిపేట ప్రాథమిక పాఠశాలలు
- గత ప్రభుత్వంలో పిల్లర్ల స్థాయిలో ఆగిన జాలరిపేట స్కూల్ భవనం
- మరమ్మతులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తుల ఆక్షేపణ

పరవాడ: లోన లొటారం, పైన పటారం అన్న చందంగా మారింది పరవాడ మండలంలోని ఊటగెడ్డపాలెం, జాలరిపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల దుస్థితి. శిథిలావస్థకు చేరిన ఊటగెడ్డపాలెం ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పాఠశాల చుట్టూ రక్షణ గోడ నిర్మాణానికి పూనుకోవడం చూసి గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రెండు పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణ పనుల్ని ఇటీవల ప్రారంభించింది. ముందుగా పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన అధికారులు, ఆ పనుల్ని గాలికొదిలేశారు. రక్షణ గోడ నిర్మాణంపైనే ధ్యాస పెట్టడాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

పెచ్చులూడుతున్న ఊటగెడ్డపాలెం స్కూల్

రక్షణ గోడలు నిర్మిస్తున్న పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే.. దయనీయంగా ఉన్నాయి. ఊటగెడ్డపాలెంలో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాల పూర్తిగా మరమ్మతులకు గురైంది. ఇక్కడ 15 మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నారు. పాఠశాలకు చాలా కాలం నుంచి రిపేర్లు చేపట్టని కారణంగా శ్లాబ్ పెచ్చులూడి విద్యార్థులు, ఉపాధ్యాయులపై పడటంతో భయాందోళన చెందుతున్నారు. శ్లాబు పెచ్చులూడి ఇనుప రాడ్లు దర్శనమిస్తున్నాయి. తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఊడిపోతున్నాయి. దీంతో ఈ స్కూల్‌కు పిల్లల్ని పంపేందుకు తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు. ఇలాంటి సమయంలో మరమ్మతులు కాకుండా.. రూ.4.35 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ప్రహరీ నిర్మించడమేంటని ప్రశ్నిస్తున్నారు. రిపేర్లతో మూల్గుతున్న ఈ పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు కూండ్రపు తాతాజీ ఆరోపించారు.



పెచ్చులూడుతున్న పాఠశాల శ్లాబ్



అసంపూర్తిగా ఉన్న జాలరిపేట ప్రాథమిక పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ



చెదలు పట్టిన కిటికీలు

తుపాను షెల్టరే దిక్కు!

జాలరీపేట ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన భవనం మంజూరైంది. నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పిల్లర్ల దశకు తీసుకొచ్చి, పనుల్ని మధ్యలోనే వదిలేశాడు. దీంతో అసంపూర్తి నిర్మాణంలో చదువులు సాగక, దగ్గర్లోని తుపాను షెల్టర్‌కు తరగతులు మారాయి. ఇక్కడ చదువుతున్న లను మధ్యలో వదులుకోవడంతో నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడ 13 మంది పిల్లలు చదువుతున్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠశాల భవన నిర్మాణాన్ని గాలికి వదిలి, పిల్లర్ల చుట్టూ ప్రహరీ నిర్మించడాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఇందుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.6.96 లక్షలు వెచ్చించడాన్ని తప్పు పడుతున్నారు. విద్యార్థుల ఇబ్బందుల్ని గుర్తించి పాఠశాలల భవనాలకు మరమ్మతులు, నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై సర్వశిక్షా అభియాన్ ఏఈ రత్నంను వివరణ కోరగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన రక్షణ గోడల నిర్మాణం పూర్తి చేసిన వెంటనే పాఠశాల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

సందడిగా తీర్థ మహోత్సవాలు



షటిల్ టోర్నీ విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన గ్రామ పెద్దలు

పెందుర్తి: రాంపురం గ్రామదేవత బంగారమ్మతల్లి పరస గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు-కుంకుమలు, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెట గుళ్లు, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంగులరాట్నాలు, వివిధ రకాల ఆటలతో పిల్లలు సందడి చేశారు. గ్రామ పెద్దలు, పలువురు ప్రజాప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పరవాడలో శ్రీరాములవారి తీర్థం

పరవాడ: మండలంలోనిపరవాడ గ్రామంలో శ్రీరాముల వారి తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీరాములవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం తీర్థంలో నిర్వహించిన భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

సబ్బవరంలో..

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు పెద నాయుడుపాలెం గ్రామంలో శ్రీకోదండ సీతారామ సత్యనారాయణ సంతోషి మాత తీర్థమహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి స్వామివారి ఆలయం వద్ద నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆకట్టుకుంది. డాన్స్ బేబి డాన్స్ కార్యక్రమం ఆకట్టుకోంది. తీర్థమహోత్సవాల్లో భాగంగా గ్రామంలో నిర్వహించిన విలేజ్ లెవల్ షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందించారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్న వారిలో గ్రామ పెద్దలు గొర్లి శ్రీనివాస్, సబ్బవరపు సత్యనారాయణ, లాలం సతీష్, కిల్లి వెంకట సత్యనారాయణ, గోళ్ల రమణ, సబ్బవరపు నాగభూషణం, కర్రి సత్యనారాయణ, సబ్బవరపు నాగేంద్రకుమార్, కిల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పూజలందుకున్న బంగారమ్మతల్లి

అందరి భాగస్వామ్యంతో తాబేళ్ల సంరక్షణ

- వివిధ విభాగాల అధికారులతో విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్ష

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలు, సుస్థిర చేపల వేట విధానంపై కలెక్టర్ గురువారం సమీక్షించారు. పలు శాఖల అధికారులు, శాస్త్ర వేత్తలు, ఫిషింగ్ బోట్ యజమానుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆడ తాబేళ్లు నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ఇటీవల సముద్ర తాబేళ్ల మృత కళేబరాలు తీరానికి చేరడం గమనిస్తున్నామన్నారు. అవి చేపల వేట సమయంలో వలల్లోను, సముద్రంలో విడిచి పెట్టే తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో చిక్కుకుని మరణిస్తున్నాయని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఇలాంటి పరిణామాల వల్ల భవిష్యత్తులో ఆలీవ్ రిడ్లే రకపు తాబేళ్లు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తాబేళ్లు తప్పించుకునే అవకాశం ఉన్న టీఈడీ పరికరాన్ని వినియోగించాలన్నారు. వన్య మృగ సంరక్షణ చట్టం – 1972 ప్రకారం తాబేళ్లను చంపడం, తినడం, అమ్మడం, అక్రజుమ రవాణా చేయడం నిషేధం అన్నారు. అందుకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీవాణి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, కేంద్ర మత్స్య సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్ కిజాకుద్దీన్, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) జోనల్ డైరెక్టర్ భామి రెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, మెరైన్ సీఐ దివాకర్, మత్స్యశాఖ ఏడీ విజయ కృష్ణ, పోలీసు అధికారులు, నెట్ ఫిష్ స్టేట్ కో-ఆర్డినేటర్ హన్మంతరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆషాజ్యోతి, డాల్ఫిన్ మెకనైజ్డ్ బోటు యజమానుల సంఘ అధ్యక్షుడు వీర్రాజు, సంప్రదాయ బోట్ల ప్రతినిధి జి.యల్లయ్య (కింగ్) పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com